www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 25 జూన్ 2025
5
చిత్తూరు

ఆగని గజ దాడులు

ప్రజాశక్తి- రొంపిచర్ల: పులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీపాలెం చుట్టుపక్కల గ్రామంలో మంగళవారం తెల్లవారు జామున ఏనుగుల గుంపు రైతు గురుస్వామికి చెందిన మామిడి తోటలకి ప్రవేశించి మామిడి చెట్లను విరిచేసి, చుట్టూ కంచెలా ఏర్పాటు చేసిన రాతికూసాలను విరిచేశాయి. పక్కనే ఉన్నటువంటి అదే గ్రామానికి చెందిన రైతుల పంట పొలాలను, మామిడి కొమ్మలను విరిచేసి అడవిలోకి వెళ్లిపోయాయి. పులిచెర్ల మండలంలో నిత్యం ఏనుగుల బెడదతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అటవీ శాఖ అధికారులకు సమాచారం తెలియడంతో పంట పొలాలను పరిశీలించారు.

ఏనుగులు ధ్వంసం చేసిన మామిడి తోట

భూ సర్వే సమస్యతో అందని రుణాలు

గత ప్రభుత్వం సమగ్ర భూ సర్వే పేరిట జిల్లాలో రెవెన్యూ, సచివాలయ ఉద్యోగుల ద్వారా పెద్దఎత్తున భూ సమస్యలను పరిష్కరించి హద్దులు నిర్ణయించేందుకు చేసిన సర్వే అర్ధతరంగా ఆగిపోవడంతో జాయింట్ పట్టాలు పొందిన వారు ప్రభుత్వం అందించే ప్రభుత్వ పథకాలకు అనర్హులుగా మారుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కోఆపరేటివ్ బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు రైతులు నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. సర్వే నెంబర్ల బదులు ఒకే ఎల్‌పీఎం నంబర్లు ఇవ్వడంతో భూ విస్తీర్ణం మారక చాలా మంది రైతులు రుణాలు పొందేందుకు అనర్హులవుతున్నారు.

ఫుడ్ అండ్ నీడ్స్ మామిడి గుజ్జు పరిశ్రమ ఎదుట విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ, సచివాలయ సిబ్బంది

- జాయింట్ పట్టాల సమస్యతో ప్రభుత్వ పథకాలు దూరం
- అవస్థలు పడుతున్న రైతన్నలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లాలో రీ సర్వే పూర్తయిన గ్రామాలలో వెబ్ ల్యాండ్ 2.0 జాయింట్ పట్టాదారులుగా నమోదైన భూ యజమానులకు భూ విభజన చేసేందుకు రూ.500లు పూర్తిగా మినహాయించి ఉచితంగా పొందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు చిత్తూరు జిల్లాలో 319 గ్రామాలో ప్రత్యేక డ్రైవ్ కొనసాగిస్తున్నారు. ఈ డ్రైవ్ ఈనెల 30వ తేదీ వరకు మాత్రమే వర్తింస్తుందని జాయింట్ కలెక్టర్ చెబుతున్నారు. ఈనెల 30వ తేదీ లోపు జాయింట్ భూములపై వ్యక్తిగత హక్కుల కోసం జాయింట్ భూసమస్యలు ఎదుర్కొంటున్న రైతులు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. జాయింట్ భూముల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేకడ్రైవ్ ద్వారా రైతులు తమ భూమిపై పూర్తి హక్కు పొంది ప్రభుత్వ పథకాల లబ్ధి పొందే అవకాశంతోపాటు రిజిస్ట్రేషన్, రుణాలు పొందే అవకాశం కలుగుతుందని రెవిన్యూ అధికారులు చెబుతున్నారు. ఇందు కోసం సంబంధిత రెవెన్యూ కార్యాలయాల్లో జాయింట్ పట్టాల సమస్య ఉన్న రైతులు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌లో జాయింట్ పట్టాలు కలిగిన వ్యక్తులు విడివిడిగా పట్టాలు పొందే అవకాశం ఉంటుంది. ఇలా పట్టాలు పొందిన వారు అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలు అర్హులుగా మారే అవకాశముంది. జాయింట్ పట్టాలో ప్రభుత్వ నిబంధనల మేరకు భూమి ఎక్కువగా ఉన్న వారు అన్నదాతా సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలను అనర్హులైయ్యారు.



రుణాల మంజూరు సాంకేతిక ఆటంకాలు..

రీ సర్వే భూములకు సహకార బ్యాంకులు రుణాలు పొందేందుకు సాంకేతిక సమస్యలు ఎదుర్వడంతో జిల్లాలో రీ సర్వేలో భూ సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు సహకార బ్యాంకుల నుండీ రుణాలు పొందలేకపోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలంటూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 30వ తేదీ వరకు జిల్లాలోని 319 గ్రామాల్లో రీ సర్వే సమస్యలు తీర్చేందుకు రెవెన్యూశాఖ ప్రత్యేకడ్రైవ్ నిర్వహిస్తోంది. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో సహకార బ్యాంకుల నుండీ రుణాలు మంజూరు కాని రైతులు పెట్టుబడి కోసం ప్రైవేట్ వ్యక్తుల నుంచి అధిక వడ్డీకి అప్పులు తీసుకుంటున్నారు. రీసర్వే గ్రామాల్లో జాయింట్ భూముల సమస్యను పరిష్కరించి రైతులకు రుణాలు మంజూరు చేయాలని, ఎల్‌పీఎం జాయింట్ భూసమస్యలు ఎదుర్కొంటున్న రైతులు కోరుతున్నారు. మరో వైపు మామిడి ఫ్యాక్టరీల ఎదుట రెవెన్యూ, సచివాలయ సిబ్బందిని నియమించడం వల్ల ప్రత్యేక డ్రైవ్ భూసమస్యలు తీర్చేందుకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని రైతులు వాపోతున్నారు.

మురుగునీటి శుద్ధి కేంద్ర నిర్మాణం జరిగేనా...!

ప్రజల సమస్య తీరేనా..?

పలమనేరు పెద్ద చెరువు ఒడ్డున పేరుకుపోతున్న వ్యర్థాలు, మురుగునీరు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పెద్దచెరువులో కలుస్తున్న మురుగునీటిని శుద్ధిచేసి వ్యవసాయానికి వినియోగించుకోవాలన్న ధ్యేయంతో కొన్ని సంవత్సరాలుగా నిర్మించ తలపెట్టిన మురుగునీటి శుద్ధి కేంద్ర నిర్మాణం ఆచరణకు నోచుకోలేదు. పలమనేరుకు ఆనుకొని ఉన్న పెద్దచెరువు సుమారు 80 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా ఆయకట్టు దాదాపు అన్ని ఎకరాల్లో ఉంది. అయితే పట్టణానికి అనుకొని ఉన్న ఈ పెద్దచెరువులోకి పలమనేరులోని రెండు ప్రాంతాల నుంచి నుంచి మురుగునీరు వచ్చి చెరువుకు చేరుకుంటోంది. దీంతో మూడు దశాబ్దాల కితం ఇక్కడి మంత్రిగా ఉన్న డాక్టర్ పట్నం సుబ్బయ్య సమస్యను గుర్తించి అప్పట్లోనే మురుగునీటి శుద్ధికేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. చెరువులో మురుగునీరు కలిసే ప్రదేశంలోనే మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేసి శుద్ధి చేసిన నీటిని ఆయకట్టు పొలాలకు మళ్లించాలని భావించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఆయన పరాజయం కావడంతో ఆ ప్రతిపాదన తదుపరి ఎన్నికలు జరిగిన ప్రతిసారి ఈ సమస్య అభ్యర్థులకు ఎన్నికల హామీగా కొన్నేళ్లపాటు కొనసాగింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జిల్లాలోని పుంగనూరు, పలమనేరు, నగరి మున్సిపాలిటీల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించి అధికారులను స్థలాల ఎంపిక చేయాలని ఆరునెలల క్రితమే ఆదేశాలు ఇచ్చింది. దీంతో అధికారులు పెద్దచెరువు ఆయకట్టు వసతులతో ఇబ్బందులు పడుతున్నారు. ఆగిపోయిన భవన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పలమనేరు పెద్దచెరువు మధ్యలో 34 ఎకరాల స్థలాన్ని ఎంపిక చేసింది. అధికారులు మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలం వివాదాస్పదంగా మారింది. దశాబ్దం క్రితం మురుగునీటిని పెద్దచెరువులో కలవకుండా ప్రత్యేక కాలువను నిర్మించి మురుగునీటిని ఆయకట్టులోని రాజకాలువకు మళ్లించారు. దీంతో ఆయకట్టుదారులు తను భూముల్లో మురుగునీరు నిలిచిపోతోందని తీవ్రంగా అభ్యంతరం చెప్పడంతో ఆ కాలువను అలాగే విడిచి పెట్టి మురుగునీటిని చెరువులోకే వదిలి పెట్టేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మురుగునీరు చెరువులో కలవకుండా రూ.కోటి అంచనాలతో చెరువులో గుండుబావి సమీపం నుంచి ప్రస్తుతం మురుగునీరు చెరువులో కలిసే ప్రాంతం వరకు ప్రత్యేకంగా పెద్దకాలువ నిర్మాణం చేపట్టారు. అయితే ఇందుకు కేటాయించిన నిధులు మళ్లించడంతో కాలువ నిర్మాణం అర్థాంతరంగా ఆగిపోయింది.

మళ్లీ తెరపైకి మురుగునీటి శుద్ధి కేంద్రం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు రూ.20 కోట్లు మంజూరు చేసింది. దీంతో అధికారులు పెద్దచెరువు ఆయకట్టు ప్రాంతంలో కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించారు. రెవెన్యూ అధికారులు ఇందుకోసం కావాల్సిన 3.5 ఎకరాలను ఆయకట్టులో గుర్తించారు. ఒక్కో ఎకరాకు ప్రభుత్వం రూ.2 కోట్లు చొప్పున చెల్లిస్తుందని ఆయకట్టు రైతులను భూసేకరణకు ఒప్పించారు. మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుతో ప్రయోజనాలు పలమనేరు పెద్దచెరువులో మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. పెద్దచెరువు దాదాపు 80 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందులో ఆక్రమణలు దాదాపు 15 ఎకరాల వరకు పెద్దచెరువులో అర్థాంతరంగా ఆగిన కాలువ నిర్మాణం, నిలిచిన మురుగునీరు ఉంటుంది. ఈ ఆక్రమణలు తొలగించినా మురుగునీటి శుద్ధి కేంద్రానికి కావాల్సిన స్థలం సమకూరుతుంది. చెరువులోనే మురుగునీరు కలుస్తున్నందున అక్కడే మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి భూమి కోసం ఎవరికి నష్టపరిహారం కింద రూ.7కోట్లు చెల్లించే అవసరం ఉండదు. బెంగళూరు, మదనపల్లి రహదారులు అనుకొనే ఉన్నందున వాహనాలు వెళ్లి వచ్చేందుకు సౌకర్యంగా ఉంటుంది. ఆయకట్టులోని పొలాలకు శుద్ధి చేసిన నీరు సరఫరా చేసుకునే అవకాశం ఉంటుంది.

నిధులు విడుదల కాకపోవడంతో ఆగిన పనులు

జిల్లాలోని పుంగనూరు, పలమనేరు, నగరి మున్సిపాలిటీల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణం ఆగిపోయింది. ఇందుకోసం ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడమే కారణమని తెలుస్తోంది. పలమనేరు మున్సిపాలిటీలో అధికారులు ప్రతిపాదించిన కేంద్రానికి రోజుకు 8.3 ఎంఎల్‌ఎల మురుగునీరు అవసరముంటుంది. అయితే పలమనేరు మున్సిపాలిటీలో నేడు అధికారులు సరఫరా చేస్తున్న నీరు కేవలం 3.1 ఎంఎల్ మాత్రమే ఏది ఏమైనా ప్రస్తుతం మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు పనులు అటకెక్కినట్టే.

యుద్ధ ప్రాతిపదికన పనులు...

- ఎన్వీ రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అన్ని నివేదికలు సంబంధిత అధికారులకు పంపడం జరిగింది. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. పెద్ద చెరువు కింద గల ఆయకట్టు దారులు కొద్దిమంది భూమి ఎస్‌టిపికి ఇవ్వడానికి ఎక్కువ డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై పరిశీలించి వీలైనంత త్వరగా పనులను ప్రారంభిస్తాం..

పక్వానికి వచ్చిన కాయలనే కోయాలి

మామిడి రైతులకు న్యాయం చేయడమే ప్రభుత్వ ధ్యేయం: కలెక్టర్

రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): రైతులు పక్వానికి వచ్చిన మామిడి కాయలనే కోసి మార్కెట్లకు తరలించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ రైతులకు తెలిపారు. మంగళవారం సాయంత్రం గుడిపాలలోని ఫుడ్ అండ్ ఇన్స్ మామిడి గుజ్జు పరిశ్రమలని పరిశీలించిన జిల్లా కలెక్టర్ రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి చివరి మామిడికాయ వరకు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేయడం జరుగుతుందని ఎవరు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు కేజీకి నాలుగు రూపాయలు చొప్పున సబ్సిడీని అందజేస్తుందని, ఆ మొత్తాలను రైతుల ఖాతాలకు నేరుగా జమ చేస్తుందన్నారు. ఎక్కడ కూడా ప్రభుత్వం ఎకరాల పరిమితి విధించలేదని, రైతుల వద్ద ఎంత పంట ఉంటే అంత పంటను జిల్లాలోని పల్ప్ ఇండస్ట్రీలకు అందించవచ్చని ఆయన తెలిపారు. స్టాక్ నిల్వలకు అనుగుణంగా పంటలను తీసుకొచ్చే విషయంలో సమయపాలన పాటించాలని రైతులకు సూచించారు. పక్వానికి వచ్చిన కాయలనే రైతులు కోసి తరలించాలన్నారు.. ఒకటి లేదా రెండు టన్నులకు సరఫరా చేసే రైతులు వద్ద నేరుగా కొనుగోలు చేయాలని యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుదారులు అప్రమత్తంగా ఉండండి..

టాక్స్ కట్టమని కమిషనర్ పేరుతో ఫేక్‌కాల్స్..
స్కానర్ పంపి డబ్బులు వసూళ్లకు ప్రయత్నం..
ఫేక్ మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి: కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

సైబర్ నేరగాళ్ల పట్ల పన్ను చెల్లింపుదారులు అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ చెప్పారు. పన్ను చెల్లించాలని కమిషనర్ పేరుతో ఫేక్ ఫోన్ కాల్స్ చేస్తూ స్కానర్ ద్వారా డబ్బులు చెల్లించాలని మోసం చేస్తున్నారని ఈ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పన్ను చెల్లించమని కమిషనర్ ఎవరికి నేరుగా ఫోన్ చేయరని, స్కానర్‌కు డబ్బులు పంపమని చెప్పే అవకాశం లేదన్నారు. కానీ నగరపాలక పరిధిలో పలువురు ఆస్తి, ట్రేడ్ లైసెన్స్ దారులకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి.. నేను కమిషనర్ మాట్లాడుతున్నా.. పన్నులు ఎందుకు చెల్లించలేదు..? టాక్స్ కట్టాలని తెలియదా..! స్కానర్‌కు డబ్బులు కట్టి ఆపరేటర్ను కలవండి.. అంటూ హడావుడి చేస్తూ.. వాట్సాప్‌లో స్కానర్ కోడ్ పంపిస్తున్నారు. పలు రకాల నెంబర్ నుంచి ఫోన్ కాల్స్ వస్తున్నట్లు గుర్తించారు. ఈ విషయంపై పన్ను చెల్లింపుదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఇలాంటి ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దని, డబ్బులు చెల్లించవద్దన్నారు. ఫేక్ ఫోన్ కాల్స్‌పై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పన్ను చెల్లింపుదారులు ఏమైనా సందేహాలు ఉన్నా, పన్నులు చెల్లించాలన్నా నేరుగా నగరపాలక కార్యాలయంలోని పురసేవ కేంద్రం, వార్డు సచివాలయ పరిధిలో అడ్మిన్ కార్యదర్శిని సంప్రదించాలన్నారు.

వంటావార్పుతో నిరసన

- కొనసాగుతున్న ఒప్పంద కార్మికుల దీక్షలు

వంటావార్పుతో నిరసన తెలుపుతున్న ఒప్పంద కార్మికులు

ప్రజాశక్తి- పుంగనూరు: మున్సిపల్‌రంగంలో ఒప్పంద కార్మికుల నిరసనలు ఉధృతంగా సాగుతున్నాయి. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో దీక్షలను కొనసాగిస్తున్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ మెయిన్ గేట్ ఎదుట దీక్ష శిబిరంలో ఇంజనీరింగ్ విభాగ ఒప్పంద కార్మికులు వంటావార్పు కార్యక్రమం నిర్వహించి వారి నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు రెడ్డిపల్లి శ్రీరాములు మాట్లాడుతూ మున్సిపల్ రంగంలో విధులు నిర్వహిస్తున్న ఒప్పంద కార్మికులకు కూటమి ప్రభుత్వం ఎన్నికలలో పెట్టిన మేనిఫెస్టోను ప్రకారం సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మున్సిపల్ రంగంలోని ఒప్పంద కార్మికులందరికీ మినిమం టైంస్కేల్ వర్తింపజేయాలన్నారు. 20 సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్న వారికి కొత్తగా విధుల్లో చేరిన వారికి ఒకే జీతం కాకుండా సీనియారిటీ ప్రామాణికంగా తీసుకుని సంవత్సరానికి ఆరుశాతం ఇంక్రిమెంట్ కలుపుకొని జీతాలు చెల్లించాలన్నారు. ఇప్పటికే గత తొమ్మిది రోజులుగా వివిధ రూపాలలో ఆందోళన నిరసనలు తెలియజేస్తుంటే కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, సంతోష్ కుమార్,ఈశ్వర్ నాయక్, హరి, నరసింహులు, జగన్నాథ్ రెడ్డి, గణేష్, సురేంద్ర, జవహర్ అలీ, మహిళ ఒప్పంద కార్మికులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన

ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి- వి కోట

స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట సచివాలయ ఉద్యోగులు మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం ఇటీవల వార్డు, మండల సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను చేపట్టింది. ప్రభుత్వ నిబంధనలలో భాగంగా జీవో నెంబర్ 5 ప్రకారం సొంత మండలాలలో ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా బయట మండలాలకు బదిలీ కావాలని సూచించింది. దీనికి నిరసనగా మండలం పరిధిలోని సచివాలయ సిబ్బంది స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో సొంత మండలంలో వేరే గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న తమను బయట మండలాలకు బదిలీ చేస్తే కుటుంబ పోషణ భారం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యను సానుకూలంగా స్పందింవి సొంత మండలంలోనే వేరే గ్రామ పంచాయతీ సచివాలయాలకు తమను బదిలీ చేయాలని ఈ మేరకు కలెక్టర్‌కు తమ సమస్యను తెలియజేస్తూ ఎంపీడీవో ఈశ్వరన్‌కు వినతిపత్రం సమర్పించారు.

మామిడి రైతుల అవస్థలు...

- గుజ్జు ఫ్యాక్టరీల వద్ద క్యూ కట్టిన ట్రాక్టర్లు
- ఐదు కిలోమీటర్ల మేర లోడుతో వాహనాలు
- తమిళనాడు రాష్ట్ర సరిహద్దు దాటిన క్యూ
- రైతులకు తిండి, నీడ ,నీరు, నిద్ర, కరువు
- పట్టించుకోని ఉద్యాన శాఖ అధికారులు

ప్రజాశక్తి- యాదమరి (చిత్తూరు)

మామిడి ధరలు పతనం కావడంతో రైతులు విలవిలాడుతున్నారు. కాయలు కోయకుండానే తోటల్లోనే వదిలేస్తున్నారు. కళ్ళ ముందు కాయలు నేల రాలి కుళ్ళిపోతుండడం చూసి తట్టుకోలేక కొంతమంది రైతులు నష్టపోతామని తెలిసినా కోత కోసి, మండిల వద్దకు వచ్చి నిరీక్షిస్తున్నారు. మరోవైపు ఫ్యాక్టరీల నుండి అనుమతి రాక మండిల వద్ద చేరిన మామిడి అక్కడే మగ్గిపోతుంది.

కొందరు మామిడి రైతులు ఫ్యాక్టరీలకు వెళ్లి రోజుల తరబడి అన్లోడ్ కాకపోవడంతో మామిడి కాయలను రోడ్లపైనే పడేసి వస్తున్నారు. ఆరుగాలం ఏడాది పొడవునా కష్టపడి మామిడి పంటను సాగు చేస్తే నేడు గిట్టుబాటు ధర లేక రైతులు అష్ట కష్టాలు పడుతున్నారు. కుటుంబాన్ని వదిలి వారాల తరబడి ఫ్యాక్టరీల గేట్లు ఎదుట పడిగాపులు పడుతున్నారు. రోజుల తరబడి నీరు, నీడ, తిండి నిద్ర లేకుండా రోడ్లపై రైతులు అగచాట్లు పడుతున్నారు. అయితే ఫ్యాక్టరీ యజమాన్యం, ఉద్యానశాఖ అధికారులు, ప్రభుత్వం సరైన వసతులు కల్పించిన దాఖలాలు లేవు.

తమిళనాడు రాష్ట్ర సరిహద్దులోనూ కిలోమీటర్ల మేర నిలిపోయిన మామిడి లోడ్ చేసిన ట్రాక్టర్లు

కష్టపడి మామిడి కొనేవారు లేకపోవడంతో రైతు కంట కన్నీరు కారుతుంది. మరి కొంతమంది ఫ్యాక్టరీల వద్దకు వచ్చి నిరీక్షిస్తున్నారు. మామిడి పంటను అమ్ముకునేందుకు రైతులు పడుతున్న కష్టాలు అంతా ఇంతా కావు. గత పది రోజులుగా గుడిపాల మండలం ఫుడ్ అండ్ ఇన్స్ ఫ్యాక్టరీ వద్ద రైతులు మామిడి కాయలను ఫ్యాక్టరీ తోలుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

చిత్తూరు- వేలూరు అంతర్రాష్ట్ర రహదారి పొడవున మామిడి కాయల ట్రాక్టర్లతో ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు రోడ్డుకిరివైపులా నిలిచిపోయాయి. ఫుడ్ అండ్ ఇన్ జ్యూస్ ఫ్యాక్టరీ తమిళనాడు రాష్ట్ర సరిహద్దు ఉండడంతో మామిడి కాయలు ఫ్యాక్టరీకి తరలించే వాహనాలు తమిళనాడు రాష్ట్రంలో సైతం కిలోమీటర్ల మేర ట్రాక్టర్లు నిలిచి ఉన్నాయి. గత పది రోజులుగా మామిడి గుజ్జు ఫ్యాక్టరీల వద్ద రైతులు పడుతున్న కష్టాలు వర్ణాతీతం.

ట్రాక్టర్‌లోనే ఉండి బాగా మాగిపోయాయని ఫ్యాక్టరీ వారు తీసుకోకపోవడంతో రోడ్డు పక్కనే కాయలో పోసేసిన దృశ్యం

రోడ్లపైనే ఉండాల్సిన పరిస్థితి...

- శేఖర్, బొమ్మనుజేను గ్రామం యాదమరి మండలం



యాదమరి మండలం నుండి ఫుడ్ అండ్ ఇన్స్ ఫ్యాక్టరీకి మామిడిలోడుతో ఫ్యాక్టరీకి తీసుకొచ్చి మూడు రోజులు గడుస్తున్నా ఇంకా రోడ్లపైనే ఉండాల్సిన పరిస్థితి. మామిడికాయలు సైతం ట్రాక్టర్ లోనే మాగిపోతున్నాయి. మాగిపోయిన కాయలను ఫ్యాక్టరీ యజమాని తిప్పి పంపిస్తున్నారు. దీంతో ఏమి చేసేది లేక రోడ్లపై పారబోస్తున్నాం.

సన్నబియ్యం భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న హెచ్‌ఎం సరస్వతి

సన్నబియ్యం భోజనం ఎంతో నాణ్యత: హెచ్‌ఎం

ప్రజాశక్తి -కార్వేటినగరం: సన్న బియ్యం భోజనం ఎంతో నాణ్యతగా వుందని ఇన్‌ఛార్జి హెచ్‌ఎం సరస్వతి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం హెచ్‌ఎం విలేకరులతో మాట్లాడుతూ పిల్లలకు ఏర్పాటు చేసిన భోజనం చాలా బాగుందని, విద్యార్థులు అధిక సంఖ్యలో భోజనం చేస్తున్నారని పేర్కొన్నారు. పిల్లల భోజనం నాణ్యతలో నిర్లక్ష్యం లేకుండా తయారు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థి పాఠశాలల్లోని భోజనం తినడంపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. మెనూ ప్రకారం ప్రతి రోజూ విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్నామని తెలిపారు. దీంతో పాటు విద్యార్థులకు నూతన యూనిఫామ్, టై, షూ, బెల్ట్ నాణ్యంగా వున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం కె సరస్వతి, ఉపాధ్యాయులు రంజిత్, కిషోర్, ఢిల్లీ, బాబు, రాములు, కల్పన, సుమతి, రాము హరి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందిస్తున్న దృశ్యం

నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి -రొంపిచర్ల: టిడిపి పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి స్ఫూర్తితో రొంపిచర్ల ఎంపీటీసీ సహదేవ తమ సొంత నిధులతో ఆరేసి పురం కాలనీ మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు మంగళవారం నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, కిట్స్ అందించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సహదేవ మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై బాగా చదివి తల్లిదండ్రులకు, పాఠశాల ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, స్కూల్ ఛైర్మన్ మహమ్మద్, మహమ్మద్ అలీ, మహమ్మద్ రఫీ, ఫజులు బాబు, మహేష్ పాల్గొని విద్యార్థులకు కిట్స్ అందించారు.

ఘనంగా గంగ జాతర

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: బంగారుపాలెం మండలం తగువారిపల్లి పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో గంగజాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం గంగమ్మకు అంబలి, పొంగలి ప్రసాదం నైవేద్యంగా పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం రాత్రి గంగమ్మ శిరస్సును గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. బుధవారం సాయంత్రం నిమజ్జనం నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు.

ట్రిపుల్ ఐటికి గ్రామీణ విద్యార్థి

ప్రధానోపాధ్యాయులు భేలినాథ్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ట్రిపుల్ ఐటికి గ్రామీణ విద్యార్థి ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయులు బేలినాథ్ మంగళవారం తెలిపారు. బంగారు పాలెం మండలం వడ్డివాని చెరువు గ్రామానికి చెందిన సావిత్రి కుమారుడు చరణ్ పదవ తరగతిలో గుండ్ల కట్ట మంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యనభ్యసించి 600మార్కులకు 571 సాధించాడు. దీంతో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఆదేశాలు అందాయన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థి ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంపై ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

ఐటిఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -శాంతిపురం: ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో రెండవ దఫా అడ్మిషన్ల కోసం ఐటిఐ ఎపి.జిఓవి.ఇన్ ఆన్‌లైను ద్వారా లేదా మీసేవ కేంద్రాల్లో విద్యార్థులు దరఖాస్తు చేసుకునే విధానం ప్రారంభమైందని శాంతిపురం ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ ఐ శేషారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కళాశాలలో ప్రవేశానికి ఆసక్తి కలిగిన విద్యార్థులు జూలై 15వ తేదీ లోపు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను జులై 17వ తేదీ తేదీలోపు శాంతిపురం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో అప్లికేషన్ వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో జులై 21వ తేదీ ఉదయం 9 గంటలకు హాజరైన విద్యార్థులకు మెరిట్ ఆధారంగా ఆన్‌లైనులో అడ్మిషన్లు మంజూరు చేస్తామని తెలిపారు. విద్యార్థు లు తమ దరఖాస్తులను సకాలంలో పూర్తి చేసి,అవసరమైన పత్రా లతో శాంతిపురం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో హాజరుకావాలని కోరారు.

అసౌకర్యం కలిగించొద్దు..

మోడల్ పాఠశాలల ఏర్పాటుపై డీఈఓకు ఎమ్మెల్యే సూచన

ప్రజాశక్తి -పలమనేరు: మోడల్ పాఠశాలల ఏర్పాటుతో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి డిఈఓకు సూచించారు. మోడల్ పాఠశాలల ఏర్పాటులో పలు పాఠశాలలు విలీనం చేయడం వల్ల నియోజక వర్గంలోని మూడుచోట్ల విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. మంగళవారం సమస్యను డీఈవోకు ఫోన్ చేసి తెలిపారు. ప్రధానంగా పలమనేరు మండలంలోని పాలమాకులపల్లి, వి కోట మండలంలోని ఎర్రినాగే పల్లి, బైరెడ్డిపల్లి మండలంలోని మూగనపల్లిలో సమస్య తలెత్తిందని దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందు తున్నారన్నారు. దీన్ని దృష్టిలో వుంచుకుని ఈ సమస్యను ఇప్పటికే కలెక్టర్, విద్యాశాఖ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. విద్యార్థులకు ఏమాత్రం అసౌకర్యం లేకుండా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని డిఈఓకు ఆయన వివరించారు. పెద్దపంజాణి మండలంలోని హైస్కూల్ అప్ గ్రేడ్ అయినప్పటికీ అక్కడ తగినంత మంది సిబ్బంది లేదని వర్క్ లో సర్దుబాటు ద్వారా సిబ్బందిని కేటాయించాలని సూచించారు.

విద్యాశాఖాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు పట్టణానికి చెందిన సిఎంసీ మిల్ యజమాని అన్నయ్య శెట్టి సోమవారం సాయంత్రం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి టిడిపి నాయకులతో కలిసి వెళ్లి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబీకులను పరామర్శించి తన సానుభూతి తెలిపారు. వికోట మండలం ఎస్ బండపల్లి కి చెందిన రామ్మూర్తి నాయుడు భార్య అనిత మృతి చెందడంతో ఆమె భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగనాథ్, కిషోర్ గౌడ్, రాంబాబు, బిఆర్‌సి కుమార్, ఖాజా, మాబాషా పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి కార్యకర్త మృతికి సంతాపం

ప్రజాశక్తి- రామకుప్పం: మండ ల పరిధి లోని పంచా యతీ కేంద్రమైన బందార్ల పల్లి టిడిపి కార్యకర్త వెంకటేషప్ప (65) అనారోగ్యంతో మృతి చెందా రు. సమా చారం తెలుసుకున్న టిడిపి నేతలు మంగళవారం ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టిడిపి తరఫున ఎనిమిది వేల ఐదు వందల రూపాయలు అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, ముని రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, ఆనందప్ప, రఘుపతి రెడ్డి, సుబ్రహ్మణ్యం, బాబు, రాధప్ప పాల్గొన్నారు.

యాదమరి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచెర్ల శ్రీకాంత్ తండ్రి ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ కంచెర్ల రామయ్య (ఈనాడు రామయ్య) మృతి పట్ల పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కంచెర్ల రామయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఎమ్మెల్సీ శ్రీకాంత్‌ను వ్యక్తిగతంగా పరామర్శించి ఓదార్చారు. వారి కుటుంబం సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పూతలపట్టు నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ అధ్యక్షులు గిరిధర్ బాబు, నాయకులు దేవాజీ, ధరణీ పాల్గొన్నారు.

ఎంపిడివోకు వినతిపత్రం అందిస్తున్న సచివాలయ సిబ్బంది

స్థానిక మండలాల్లోనే బదిలీ చేపట్టాలి

సచివాలయ సిబ్బంది వినతి

ప్రజాశక్తి -బంగారుపాలెం: స్థానిక మండలాల్లోనే సచివాలయ సిబ్బందికి బదిలీలు చేపట్టాలని సచివాలయ సిబ్బంది మంగళవారం ఎంపీడీవోకి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది వెంకటేష్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో, వార్డుల్లో బదిలీ చేపట్టారని, మండలంలోని సచివాలయం నుండి సచివాలయాలకు బదిలీలు చేపట్టాలని స్థానిక మండలాల్లో బదిలీలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు అన్ని కల్పించాలన్నారు. అనంతరం ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది గౌరీ శంకర్, సల్మా ,చంద్రశేఖర్ రాజు పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి: మాజీ ఎమ్మెల్యే

పజాశక్తి -బంగారుపాళ్యం: ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ పేర్కొన్నారు. మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ మండల వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద వైసిపి మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పలుదఫాలు చర్చించి తోతాపురి ధర 12 రూపాయలు ప్రకటించిందని, ప్రభుత్వం రాయితీ కింద కేజీకి నాలుగు రూపాయలు, కొనుగోలు చేసేవారు నుంచి 8 రూపాయలు అందించేందుకు కలెక్టర్ , వ్యవసాయ శాఖ మంత్రి జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు ప్రకటించారని, కానీ క్షేత్ర స్థాయిలో మామిడి గుజ్జు పరిశ్రమలు, ర్యాంపులు వారు కాని ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయకపోవడంతో రైతుకు మామిడి పంటపై అడియాశలు మిగిలాయన్నారు. మామిడి పంటకు పర్మిట్లు అందించడంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకుని వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అమరావతి, వైస్ ఎంపిపి శిరీష్ రెడ్డి, నియోజకవర్గ మండల కన్వీనర్లు చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, హరినాథ్ రెడి, సర్పంచులు ప్రసాద్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, నాయకులు దత్తాత్రేయ రెడ్డి, గౌతమి సుబ్బారెడ్డి, గజేంద్ర, కిషోర్ కుమార్ రెడ్డి, థామస్, ప్రకాష్ రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైసిపి నాయకులు

నడి రోడ్డుపై మామిడి కాయలు పోసి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

దగా చేశారు..!

మామిడి కాయలు రోడ్డుపై పోసి రైతుల నిరసన

ప్రజాశక్తి-తవణంపల్లి: అరగొండ బంగారు పాలెం రహదారిలోని గాజులపల్లి సమీపంలో ర్యాంపర్ల నిర్వాహకులు రైతులు పండించిన మామిడి పంట కేజీకి 2 రూపాయల 50 పైసలు చెల్లిస్తామని తెలపడంతో రైతులు ఆగ్రహించి మంగళవారం మామిడి కాయలు నడిరోడ్డుపై పోసి నిరసన తెలిపారు. జిల్లా అధికారులు కిలో 12 రూపాయలు ఇవ్వాలని తీర్మానించినా బేఖాతర్ తవణంపల్లి తహశీల్దారు సుధాకర్ ర్యాంపర్లతో ప్రభుత్వం నిర్ణయించిన ధర రైతులకు చెల్లించాలని కోరగా ర్యాంపర్లు తాము అంత చెల్లించలేమని చెప్పడంతో అక్కడే వున్న రైతులు ర్యాంపర్లను 'ఏదేమిటీ? అని ప్రశ్నించగా 'మేము చెప్పిందే ధర లేకుంటే వెళ్లిపోండి..' అని తేల్చి చెప్పడంతో రైతులు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. అధికారులు రావాలని రైతులు నిరసన చేపట్టారు. దీంతో బంగారుపాలెం అరగొండ రహదారిలో ట్రాఫిక్ జామ్ అయింది. రైతుల శ్రమ కష్టానికి, రహదారి మధ్య జరిగే ధరల దోపిడీకి ముగింపు లభించాలంటే అధికారుల జోక్యం ఎంతో అవసరం.. త్వరగా వస్తుందో వేచి చూడాల్సిందే!

నిబంధనలకు విరుద్ధం.. ఇంటర్ కళాశాలలు

సీమాంధ్ర విద్యార్థి సంక్షేమ సంఘం

ప్రజాశక్తి- గంగవరం: గంగవరం మండలంలో అనుమతులు లేకుండా పలు విద్యా సంస్థలు నడుస్తున్నాయని, వీటిపై చర్యలు తీసుకోవాలని సీమాంధ్ర విద్యార్థి సంక్షేమ సంఘం నాయకులు డిమాండు చేశారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బోర్డు నిబంధనల ప్రకారం కళాశాలలు తరలింపునకు ముందు మౌలిక వసతులు, భవన నిర్మాణ ప్రమాణాలు, ఫైర్ సెఫ్టీ, పంచాయతీ అనుమతులు లభించాల్సి వుందన్నారు. బోర్డు నుంచి ప్రత్యేక పరిశీలన, గుర్తింపు వుండాల్సి వుందన్నారు. ఒకే మండలంలో అనేక కళాశాలలకు అనుమతులు ఇవ్వడం విద్యార్థుల భవిష్యత్తుకు హానికరమన్నారు. మండలంలో ఇప్పటికే కళాశాలలు అధికంగా ఉన్నాయని, అక్కడున్న కళాశాలలకే అడ్మిషన్ లభించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యా సంస్థలు ఒకే చోట ఉంటే ఘర్షణలు ర్యాగింగ్‌లకు అవకాశం వుంటుందన్నారు. కొన్ని కళాశాలలు ఉచిత విద్య, ఉచిత బస్సు అని మభ్యపెడుతూ చేర్చుకున్న తర్వాత వారిపై ఫీజుల మోత, పుస్తకాల మోత, యూనిఫాంలో మోత.. ఇలా రకరకాలుగా పీడిస్తున్నా రన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొత్తగా మరో కళాశాల ప్రారంభించడం విద్యార్థులపై ఆర్థిక, విద్యా భవిష్యత్‌ను దెబ్బతీసేలా వుందని విద్యార్థి సంఘం పేర్కొంది. 'ఏ నిబంధన ప్రకారం ఈ సెట్టింగ్‌కు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది?' అని ప్రశ్నిస్తూ, బై నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్‌సి జూనియర్ కళాశాల షిఫ్టింగ్‌కు అనుమతులపై విచారణ జరిపి అక్రమమైతే రద్దు చేయాలని కోరారు. మండలానికి తగిన కళాశాల పరిమితిని స్పష్టంగా వెల్లడించాలని కోరారు. గంగవరం మండలంలోని కళాశాలలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి అనధికారికంగా నడుస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. విద్యార్థుల ఆకర్షణ కోసం నిబంధనలు వక్రీకరించే ప్రైవేట్ సంస్థలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలి డిమాండు చేశారు. ఈ విషయమై ఇప్పటికే జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో వినతిపత్రం అందించారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోకుంటే విద్యార్థి ఉద్యమం ఉధృతం చేస్తామని సీమాంధ్ర విద్యార్థి సంక్షేమ సంఘం నాయకులు హెచ్చరించారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం నెల్లిమంద మండల పరిషత్ ప్రాథమి కోన్నత పాఠశాల విద్యార్థులు 60 మందికి సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర సామగ్రి ని ప్రధానోపాధ్యాయులు యల్లయ్య ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఒకటి నుండి ఐదవ తరగతి వరకు చదివే విద్యార్థులకు యూనిఫామ్, బెల్టు, బూట్లు, బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేసిందని వీటిని తమ పాఠశాలలోని 60 మంది విద్యార్థులకు అందించామన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి వారి ద్వారా పంపిణీ చేశామని తెలిపారు.

కార్వేటినగరం: కార్వేటినగరం మండలంలోని ఉర్దూ స్కూల్‌లో బడిఈడు పిల్లలను మంగళవారం బడిలో చేర్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, పుస్తకాలు ఎంఈఓ విజయ్ కుమార్, మనోజ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ ఉర్దూ భాషను గౌరవిస్తూ ప్రతి పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను ఉర్దూ స్కూల్లో చేర్పించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉర్దూ పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేస్తున్న ప్రభుత్వ ఖాజీ కె జాఫర్ అలిహానాఫీ, ఢంకా హమీద్ బాషా, షేక్ సంధానిలను ఎంఈఓలు అభినందించారు. ఉర్దూ స్కూలు ప్రధాన ఉపాధ్యాయురాలు జబిన సుల్తాన్, సహిత విద్య ఉపాధ్యా యు లు సింధుజ, రేఖ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హమీద్ భాషా, సందని పాల్గొన్నారు.

విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న ఎంఈవోలు

విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం

కుప్పం రూరల్ : కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ కనమపచర్లపల్లి ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు విద్యార్థులకు విద్యా కిట్లను పంపిణీ చేశారు. పలువురు మాట్లాడుతూ విద్యా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశానుసారం విద్యా శాఖ మంత్రి వినూత్న పతకాలను అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా తల్లికి వందనం, విద్యా కిట్ల పంపిణీ పతకాలను అమలు చేశారన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ తల్లికి వందనం అమలు చేసిన ముఖ్యమంత్రికి, విద్యా శాఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జి కనకరాజు, పార్టీ అధ్యక్షులు బీరప్ప, దేవేంద్ర, శరవణ, వెంకటేష్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హజ్ యాత్ర విజయవంతంతో సంబరాలు

ప్రజాశక్తి -పుంగనూరు: పవిత్ర హజ్ యాత్రను విజయవంతంగా పూర్తిచేసిన అనంతరం, మక్కా మదీనా భూముల నుంచి తిరిగొచ్చిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన హాజీలకు బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్ హాజీ హాసన్ బాష నేతృత్వంలో, హజ్ కమిటీ ఈఓ గౌస్ పీర్, హజ్ కమిటీ సభ్యుల సమక్షంలో నిర్వహించారు.

హజ్ యాత్రను సురక్షితంగా పూర్తి చేసిన 390 మంది హాజీలు, ముఖ్యంగా అన్నమయ్య జిల్లా నుంచి తిరిగొచ్చిన నేపథ్యంలో, వారి రాక సందర్భంగా నిర్వహించిన స్వాగత కార్యక్రమం ఆధ్యాత్మికతతో నిండి ఎంతో ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ , కర్ణాటక రాష్ట్ర హజ్ కమిటీ ఛైర్మన్, హజ్ కమిటీ సభ్యులు హాజీలకు స్వాగతం పలికారు. హాజీల కుటుంబ సభ్యులు, మత పెద్దలు, రాజకీయ నాయకులు, స్థానిక నాయకులు ఈ వేడుకలో పాల్గొన్నారు. హజ్ యాత్ర ముస్లింలకు అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక పర్వదినంగా భావిస్తా రన్నారు. హాజీల రాక సంద ర్భంగా వారికి స్వాగ తం పలకడం ఒక సంప్ర దాయంగా కొనసా గుతోంది. ఈ నేపథ్యంలో హజ్ కమిటీ ఛైర్మన్ హాజీ హాసన్ బాష, హాజీలను వ్యక్తిగతంగా ఆత్మీయంగా ఆహ్వానించారు. ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు సజావుగా సాగాయని, భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు యన్ బాబా ఫక్రుద్దీన్, రేష్మా పర్వీన్, ఖాదర్ ఖాన్, మాజీ మహిళా కమిషన్ మెంబర్ పర్వీన్ భాను, పుంగనూరు పట్టణ టిడిపి నాయకులు సయ్యద్ సుహేల్ బాషా, ముస్లిం మత పెద్దలు, హజ్ యాత్ర నిర్వాహకులు పాల్గొ న్నారు. హాజీలు తమ యాత్రలో చేసిన ప్రార్థనలు, మత కార్యాచరణలు, జీవితాంతం తమకు మార్గదర్శకంగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ శాంతి, అభివృద్ధి, ప్రజల క్షేమం కోసం ప్రత్యేక దువా చేసినట్లు హాజీలు తెలిపారు.

హజ్ యాత్రికులకు ఘన స్వాగతం పలుకుతున్న దృశ్యం

మండల పంచాయతీరాజ్ ఉపాధ్యక్షులుగా లోకానందం నాయుడు

ప్రజాశక్తి -కార్వేటినగరం : కార్వేటినగరం మండల వైసిపి పంచాయతీరాజ్ విభాగ కమిటీ అధ్యక్షులుగా సీడీ కండ్రిగ పంచాయ తీకి చెందిన ఆకుల గోపి, ఉపాధ్యక్షులు గా ఎంపికైన ముక్కర వాని పల్లి పంచాయతీకి చెందిన లోకానాధ నాయుడు కార్వేటినగర మండల పంచాయ తీ రాజ్ విభాగ కమిటీ అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా తమను నియ మించి నందుకు మాజీ ఉప ముఖ్యమంత్రి కె నారాయణ స్వామికి, గంగాధర నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఇన్‌ఛార్జి కృపాలక్ష్మి, ఎంపీపీ లతా బాలాజీకి, సర్పంచ్ ధనంజయవర్మకి, పార్టీ అధ్యక్షులు శేఖర్ రాజు, తనను ఆదరించిన మండల వైసిపి నాయ కులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహి స్తున్నామని ఎంపీపీ లతా బాలాజీ ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు.

క్రైం న్యూస్

ద్విచక్ర వాహనాలు ఢీ

వ్యక్తికి తీవ్రమైన గాయాలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరికి బలమైన గాయాలైన సంఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. మండలంలోని నెల్లిపట్ల పంచాయతీ పరిధిలోని బాపలనత్తం గ్రామానికి చెందిన పురుషోత్తం (30) బైరెడ్డిపల్లి మండలం నక్కనపల్లి రోడ్డు సచివాలయం సమీపంలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తుండగా మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో పురుషోత్తం తీవ్ర గాయాల పాలయ్యారు. వైద్యం నిమిత్తం క్షతగాత్రుడిని బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

అనుమతి లేని స్టిక్కర్లను తొలగిస్తున్న పోలీసులు

అనుమతి లేని స్టిక్కర్లు తొలగింపు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: వాహనాలకు అనుమతి లేని స్టిక్కర్లను తొలగించినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం జిల్లా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వాహ నాల తనిఖీ కార్యక్ర మం చేపట్టారు. ద్విచక్ర వాహనాల్లో పోలీస్, ఆర్మీ ప్రెస్ ఉన్న వాహనాలను తనిఖీ చేసి నిబంధన లకు వ్యతిరేకంగా వాహనా లపై వేసుకున్నందుకు ద్విచక్ర వాహనాల చట్టం ప్రకారం అపరాధం విధించామని పది వాహనాలకు రెండువేల రూపాయలు అపరాధం వేసి వాహనాలపై ఉన్న పేర్లను తొలగించామని తెలిపారు. చట్ట ప్రకారం పోలీస్, ప్రెస్, ఆర్మీ స్టిక్కర్లను ఉంచుకోవాలని అనుమతి లేని వాహనాలకు వుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న స్థానిక ప్రజలు

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

ఎమ్మెల్యేకు గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: దుస్థితిలో వున్న రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని మంగళవారం కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బైరెడ్డిపల్లి టు కుప్పం జాతీయ రహదారి లోని కైగల నుండి రామసముద్రం, ఎం కొత్తూరు గ్రామాల వరకు గత టిడిపి ప్రభుత్వంలో రోడ్డుపై కంకర పరిచారు. అంతలోనే వైసిపి అధికారంలోకి రావడంతో ఆ రోడ్డును తారు వేయడం మరిచిపోయారన్నారు. అప్పటినుండి ఇప్పటివరకు ఆ రోడ్లో ప్రయాణించే రామసముద్రం, ఎం కొత్తూరు, మునిపల్లి, శనిపల్లి గ్రామస్తులు గత ఆరు సంవత్సరాలుగా కష్టాలు తప్పడం లేదన్నారు. కంకర తేలిపోయి గుంతలు ఏర్పడడంతో రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలు వెళుతుంటే స్కిడ్ అయ్యి ఎంతో మంది గాయపడ్డారని తెలిపారు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోవడం లేదన్నారు. ఈ పరిస్థితుల్లో పలమనేరు నియోజకవర్గం ఎమ్మెల్యే అమర్నాథ్ రెడ్డి వద్దకు వెళ్లి శిథిల పరిస్థితుల్లో ఉన్న కైగల్ టు రామసముద్రం రోడ్డును పూర్తి చేస్తామని గతంలో ఎన్నికల్లో హామీ ఇచ్చారని ప్రస్తుతం పూర్తి చేయాలని కోరారు. ఈ విషయమై ఎమ్మెల్యే మాట్లాడుతూ దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరలో పరిష్కరిస్తారని వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఆ రోడ్డు ప్రమాదంలో ప్రమాదం జరిగిన వివరాలను ప్రజల వద్ద నుండి అడిగి తెలుసుకున్నారు.

కాణిపాకం ఆలయం సందర్శన

ప్రజాశక్తి- ఐరాల: కాణిపాకం ఆలయాన్ని కేంద్రీయ విద్యాలయ కమిషనర్, న్యూఢిల్లీ శ్రీ నిధి పాండే మంగళవారం దర్శించుకున్నారు. వీరికి కలెక్టర్ సుమిత్ కుమార్, స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. స్వామి వారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటాన్ని దేవస్థానం ఈవో పెంచల కిషోర్ అందించారు. ఈ కార్యక్రమంలో వినోద్ కుమార్ డిప్యూటీ కమిషనర్ కేంద్రీయ విద్యాలయ, మనోజ్ కుమార్ అసిస్టెంట్ కమిషనర్ కేంద్రీయ విద్యాలయ, ఆలయ ఏఈఓ రవీంద్ర బాబు, సూపరింటెండెంటు వాసు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

పేరు మార్పు / సవరణ

నా కుమార్తె ఎ.వర్ష D/o బి యం ఆనంద, నివాసం: డోర్ నెం. 4-2011/ఎ, సిద్దార్థ నగర్, వెల్లూరు రోడ్డు, గిరింపేట, చిత్తూరుజిల్లా.

ప్రస్తుతం నా కుమార్తె ఆధార్‌లో ఆమె పేరు ఏ.యమున (A.Yamuna) అని తప్పుగా నమోదు కాబడినది. ఇప్పుడు 10వ తరగతి మార్కుల జాబితా ప్రకారం ఆమె పేరును **ఆనంద వర్ష D/o బి యం ఆనంద** (ANANDA VARSHA, D/o B M ANANDA) గా మార్పు చేయుట జరిగినది. కావున నేటి నుండి నా కుమార్తె పేరు ఆనంద వర్ష (ANANDA VARSHA) గా పిలవబడును. ఆధార్‌లో మార్పు కొరకు.